RNI : APTEL / 2023 / 89152

Happy Work Anniversary. 1St Year

షణ్ముఖ

SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

THE POWER OF PEN

సంపుటి : 3 సంచిక : 34 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 04 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 03 ISSUE : 34 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 04 February 2026 PAGES : 8 PRICE : 3/-

# ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ

- రాష్ట్రాన్ని అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చడమే లక్ష్యమన్న సీఎం
- లంబసింగిలో పీపీపీ విధానంలో కుంకుమపువ్వు సాగుకు ప్రణాళిక
- ఆక్వా సాగు వివరాల నమోదు తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం
- రైతుల కోసం డిజి రైతు బజార్, కిసాన్ డ్రోన్ యాప్‌ల ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 03)

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, ఏలూరు జిల్లాలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయిలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కోకో సిటీలో సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అన్ని ప్రక్రియలు ఒకేచోట ఉండేలా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో దీనిని అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు. దీనితో పాటు మామిడి, జీడిమామిడి, కొబ్బరి తోటల్లో కోకోను అంతర పంటగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.

### ప్రకృతి వ్యవసాయ హబ్‌గా ఏపీ

రాష్ట్రాన్ని దేశంలోనే అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసేందుకు ముందుకొచ్చారని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. 2030-31 నాటికి 40 లక్షల మంది రైతులను భాగస్వాములను చేస్తూ, సాగు విస్తీర్ణాన్ని 50 లక్షల ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం ద్వారా రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, వారి ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందని వివరించారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యతను ధ్రువీకరించేందుకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయాలను ఏప్రిల్ నాటికి సిద్ధం చేయాలన్నారు. సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

### పంటల వైవిధ్యంపై ప్రత్యేక దృష్టి

సంప్రదాయ పంటలతో పాటు, వాణిజ్యపరంగా లాభదాయకమైన పంటల సాగును ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా, లంబసింగి ప్రాంతంలో స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) -మిగతా 2లో

## ఢిల్లీ చేరుకున్న నారా లోకేశ్... నేడు కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు

**రాష్ట్ర అభివృద్ధి, నిధుల సమీకరణే ప్రధాన అజెండా**

**అమరావతి, విభజన హామీలపై చర్చించే అవకాశం**

**ఐటీ, విద్యా రంగాల విస్తరణపై ప్రత్యేక దృష్టి**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 03)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ ఎంపీలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ ఎంపీలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కాగా, రాష్ట్రానికి సంబంధించిన కీలక అభివృద్ధి పనులపై చర్చించేందుకు, నిధులు రాబట్టేందుకు లోకేశ్ రేపు (ఫిబ్రవరి 4) కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశం కానున్నారు.

ఈ రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్న లోకేశ్, బుధవారం పార్లమెంట్ భవనంలో పలువురు కేంద్ర మంత్రులతో కీలక భేటీలు జరపనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలో ఐటీ రంగం విస్తరణ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు, విద్యారంగ సంస్కరణలు వంటి అంశాలపై చర్చించనున్నారు. వీటితో పాటు ఏపీ విభజన చట్టంలోని హామీల అమలు, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు, కొత్త ప్రాజెక్టుల మంజూరు వంటి విషయాలపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపనున్నారు.

ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయించిన రాయితీలు, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత -మిగతా 2లో

## నష్టాల నుంచి లాభాల బాట పట్టిన విశాఖ స్టీల్ ప్లాంట్... సీఎం చంద్రబాబు స్పందన

- రికార్డు స్థాయిలో 94 శాతానికి చేరిన ఉత్పత్తి సామర్థ్యం
- రూ.54 కోట్ల లాభం సాధించిన ఆర్ఐఎన్ఎల్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అనూహ్య ప్రగతి
- విశాఖ ఉక్కుకు పూర్తి సహకారం అందిస్తామన్న సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 03)

ఒకప్పుడు తీవ్ర నష్టాలతో మూసివేత అంచులకు చేరిన విశాఖ స్టీల్ ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) మళ్లీ లాభాల బాట పట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కేవలం ఏడాదిన్నర కాలంలోనే అనూహ్య ప్రగతి సాధించి, ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు సచివాలయంలో విశాఖ ఉక్కు పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులు ప్లాంట్ పనితీరును సీఎంకు వివరించారు. 2024-25 రెండో త్రైమాసికంలో రోజుకు కేవలం 9,215 టన్నులుగా ఉన్న ఉక్కు ఉత్పత్తి, ప్రస్తుతం మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తిస్థాయిలో పనిచేస్తుండటంతో రోజుకు 19,401 టన్నులకు చేరిందని తెలిపారు. దీంతో ప్లాంట్ సామర్థ్య వినియోగం 45 శాతం నుంచి రికార్డు స్థాయిలో 94 శాతానికి పెరిగింది. ఈ ప్రగతి ఆర్థిక ఫలితాల్లోనూ స్పష్టంగా కనిపించింది. 2024 సెప్టెంబర్‌లో రూ.486 కోట్ల నష్టాన్ని నమోదు చేసిన ఆర్ఐఎన్ఎల్, 2026 జనవరి నాటికి రూ.54 కోట్ల లాభాన్ని ఆర్జించింది. కేంద్ర ప్రభుత్వం అందించిన రూ.11,000 కోట్ల ఆర్థిక సహాయం ప్లాంట్‌ను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించిందని, దీంతో సంస్థ -మిగతా 2లో

## అమెరికాతో ట్రేడ్ డీల్ ఏపీ ఆక్వా రంగానికి ఒక వరం

**మంత్రి అచ్చెన్నాయుడు**

**భారత ఉత్పత్తులపై అమెరికా టారిఫ్‌ల తగ్గింపు**

**ఏపీ ఆక్వా రైతులకు ఇది శుభవార్త అన్న మంత్రి అచ్చెన్నాయుడు**

**25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిన సుంకం**

**10 నుంచి 15 శాతం పెరగనున్న సీఫుడ్ ఎగుమతులు**

**రైతులు, మత్స్యకారుల ఆదాయం పెరుగుతుందని అంచనా**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 03)

భారత ఉత్పత్తులపై అమెరికా ప్రభుత్వం టారిఫ్‌లను తగ్గించడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వాగతించారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఆక్వాకల్చర్ రంగానికి గణనీయమైన ఊరటనిస్తుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కింద టారిఫ్‌ను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం, ఆక్వా రంగంలో అగ్రగామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఒక వరం లాంటిదని ఆయన అభివర్ణించారు. దీనివల్ల రాష్ట్రంలోని రైతులు, మత్స్యకారులకు ఆదాయ స్థిరత్వం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో అధిక టారిఫ్‌ల కారణంగా తగ్గిన ఎగుమతులు మళ్లీ పుంజుకుంటాయని, అమెరికా మార్కెట్లో భారత ఉత్పత్తుల పోటీతత్వం పెరుగుతుందని అచ్చెన్నాయుడు అన్నారు. గతంలో విధించిన 25 శాతం టారిఫ్‌కు అదనంగా ప్రతీకార సుంకాలు విధించడంతో మొత్తం భారం 50 నుంచి 58 శాతానికి చేరింది. దీని ఫలితంగా, 2025 ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో అమెరికాకు మన దేశ సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు పరిమాణంలో సుమారు 15 శాతం తగ్గి 2.01 లక్షల టన్నులకు, విలువలో 6.3 శాతం తగ్గి 1.72 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ముఖ్యంగా, ప్రధాన ఎగుమతి అయిన రొయ్యలపై ఈ ప్రభావం తీవ్రంగా పడింది. తాజా టారిఫ్ తగ్గింపుతో అమెరికా మార్కెట్లో భారత సముద్ర ఉత్పత్తుల పోటీతత్వం గణనీయంగా మెరుగుపడుతుందని, నిలిచిపోయిన ఎగుమతి ఆర్డర్లు తిరిగి ప్రారంభమవుతాయని అచ్చెన్నాయుడు వివరించారు. రాబోయే నెలల్లో అమెరికాకు సీఫుడ్ ఎగుమతులు 10 నుంచి 15 శాతం పెరిగే అవకాశం ఉందని, 2025-26 ద్వితీయార్థంలో ఎగుమతులు మునుపటి స్థాయికి చేరుకోవచ్చని ఆయన అంచనా వేశారు. -మిగతా 2లో



## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై విపక్షాల ఫైర్

- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై తీవ్ర విమర్శలు
- భారత సార్వభౌమాధికారంపై ప్రశ్నలు లేవనెత్తిన విపక్షాలు
- ట్రంప్ ప్రకటనల వెనుక దాగివున్న అజెండా ఉందని ఆరోపణ
- రైతులు, ఇంధన భద్రతపై ప్రభావం చూపుతుందని ఆందోళన

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 03)

భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. దేశ సార్వభౌమాధికారం, ప్రభుత్వ పారదర్శకత, రైతుల ప్రయోజనాలు, ఇంధన భద్రత వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారత ప్రభుత్వం బదులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటనలు చేయడంపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ఒప్పందం వల్ల అమెరికాకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని వారు ఆరోపించారు.

ఈ ఒప్పందంపై సంతోషించాల్సింది ఏమీ లేదని కాంగ్రెస్ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ అన్నారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "గతంలో 3-4 శాతంగా ఉన్న టారిఫ్‌ను ఇప్పుడు 18 శాతానికి తగ్గించామని సంబరపడటం ఆశ్చర్యంగా ఉంది. మన దేశానికి సంబంధించిన వాణిజ్య ఒప్పందాల గురించి ట్రంప్ చెప్పడమేంటి? మనం ఇంకా సార్వభౌమ దేశం కాదా? ఏ దేశం నుంచి చమురు కొనాలి, ఎవరితో వ్యాపారం చేయాలో అమెరికా నిర్ణయిస్తుందా? ప్రధాని బదులు ట్రంప్ నుంచి -మిగతా 2లో

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం.. వ్యవసాయ ఉత్పత్తులపై కేంద్రం క్లారిటీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఫిబ్రవరి 03)

రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ లేదన్న కేంద్ర ప్రభుత్వం

అమెరికా వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు ససేమిరా వెనెజువెలా చమురు కొనుగోలు చేస్తామన్న కేంద్రం

అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో, రైతుల ప్రయోజనం అంశంపై భారత ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందం జరిగిందని, అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత్ కట్టుబడి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. -మిగతా 2లో

## ఇంకా ఎన్నాళ్లీ బఫర్ జోన్లు కేంద్రాన్ని నిలదీసిన అసదుద్దీన్ ఒవైసీ

చైనా సరిహద్దు అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఒవైసీ

2020కి ముందున్న పెట్రోలింగ్ హక్కులు ఇప్పుడున్నాయా అని నిలదీత

బఫర్ జోన్లు, చైనా మౌలిక వసతుల నిర్మాణంపై ఆందోళన

చైనా విషయంలో ప్రభుత్వం భయపడుతోందని ఘాటు విమర్శ

పార్లమెంటులో చర్చకు అవకాశం ఇవ్వడం లేదని ఆరోపణ

4



## సమస్యలు పరిష్కరించాలని కరేడు పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్‌కి సమ్మె నోటీసు అందజేసిన ఆశా వర్కర్లు




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 3)

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కరేడు మెడికల్ ఆఫీసర్ డా.ఏ. అనిల్ కుమార్ గారికి మంగళవారం కరేడు సిహెచ్ సి లోని ఆశా వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడుతూ ఆశాలను కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, అన్ని రకాల సెలవులు యివ్వాలని,సంక్షేమ పథకాలను అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ఆశా వర్కర్లందరూ పాల్గొనాలని కోరారు. ఈ సమ్మె నోటీసును ఇచ్చిన వారిలో ఆశా లీడర్ ఎం జయమ్మ, సుజాత, సిహెచ్ వెంకటరమణమ్మ, శారద, భవాని, పద్మ, సునీల, తదితరులు పాల్గొన్నారు.

## 12న జరగనున్న కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి

### ఏఐటీయూసీ, సీఐటీయూ సమావేశంలో అందే నాసరయ్య పిలుపు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 3)

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్ ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో కార్మిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు అందే నాసరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన లేబర్ కోడ్ లు వల్ల కార్మిక చట్టాలు, కార్మికుల హక్కులను హరించేవిగా ఉన్నాయని విమర్శించారు. కార్మికుల భద్రత, ఉపాధి హక్కులు, వేతనాల పరిరక్షణను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.

ఈ సమావేశంలో ఏఐటి యుసి జిల్లా కార్యదర్శి ఎస్‌కె ఖాశీం, సిఐటియు జిల్లా కార్యదర్శి డి సోమయ్య, డికెఎం రఫీ, తదితర కార్మిక నాయకులు పాల్గొని ప్రసంగించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని, 12న జరగనున్న సమ్మెలో కార్మికులంతా పాల్గొని ఉద్యమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

## రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కట్టుబడి ఉందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ పేర్కొన్నారు. జిల్లా బిజెపి కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యామిని శర్మ మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంది అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ప్రవేశపెట్టిన 2026 బడ్జెట్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పై వైసిపి నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.తిరుపతి లడ్డు విషయంలో వెంకటేశ్వర స్వామిని రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. తిరుపతి లడ్డులో కల్తీ జరిగిన మాట వాస్తవమన్నారు. రూ. 250 కోట్ల మేర అవినీతి స్కాం జరిగిందన్నారు. సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు శివారెడ్డి, పివి కృష్ణారెడ్డి, డి శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ

విధానంలో కుంకుమపువ్వు సాగు చేపట్టే సంస్థలకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. అరటి ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో ఉన్నా, ఎగుమతుల్లో వెనుకబడ్డామని, ఇకపై ఎగుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

**అనుబంధ రంగాలకు చేయూత**

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన ఆక్వా, పౌల్ట్రీ పరిశ్రమల బలోపేతానికి కూడా ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ఆక్వా రైతులు తమ సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకునే విధానాన్ని అమలు చేయాలన్నారు. పౌల్ట్రీ రంగానికి ఊతమిచ్చేలా, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టులను నేరుగా రైతులకే అప్పగించాలని నిర్దేశించారు.

**టెక్నాలజీ వినియోగం, మార్కెటింగ్**

ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ 'భారత్ విస్తార్' వంటి టెక్నాలజీలను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. విజయవాడలో పీపీపీ విధానంలో ఫ్లవర్ మార్కెట్ నిర్మాణానికి అంగీకారం తెలిపారు.

ఈ సందర్భంగా 'డిజి రైతు బజార్', 'ఏపీఏఐఎంఎస్', 'కిసాన్ డ్రోన్' యాప్‌లను సీఎం ఆవిష్కరించారు. వీటి ద్వారా రైతులు కూరగాయలు ఆన్‌లైన్‌లో అమ్మడం, వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్లు అద్దెకు తీసుకోవడం వంటి సేవలు పొందవచ్చని అధికారులు వివరించారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నష్టాల నుంచి లాభాల బాట పట్టిన విశాఖ స్టీల్ ప్లాంట్... సీఎం చంద్రబాబు స్పందన

క్రెడిట్ రేటింగ్ కూడా మెరుగుపడిందని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. యాజమాన్యం, కార్మికులు, ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేసి విశాఖ ఉక్కును మరింతగా విజయపథంలో నడపాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సీఎండీ మనీష్ రాజ్ గుప్తా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీ చేరుకున్న నారా లోకేశ్... నేడు కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు

శాఖల మంత్రులతో లోకేశ్ చర్చించనున్నారు. అలాగే, రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రూ.92,649 కోట్ల పనుల వివరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై హై-స్పీడ్ రైల్వే కారిడార్ల అంశంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యే అవకాశం కూడా ఉంది. కీలక సమావేశాల అనంతరం బుధవారం రాత్రికి ఆయన తిరిగి ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

## ఇంకా ఎన్నాళ్లీ బఫర్ జోన్లు?: కేంద్రాన్ని నిలదీసిన అసదుద్దీన్ ఒవైసీ

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,ఫిబ్రవరి 03)

ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, చైనా విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధానమంత్రి కార్యాలయాన్ని (పీఎంఓ) ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆరు సూటి ప్రశ్నలు సంధించారు. లడఖ్ సరిహద్దుల్లో చైనా దూకుడు, బఫర్ జోన్ల ఏర్పాటు, మౌలిక సదుపాయాల నిర్మాణం వంటి కీలక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు.ఒవైసీ తన ప్రశ్నల్లో, "చైనాతో ఎలాంటి ఒప్పందం కుదుర్చుకున్నారు? ఏప్రిల్ 2020కి ముందు మన సైన్యం పెట్రోలింగ్ నిర్వహించిన అన్ని ప్రాంతాల్లో ఇప్పుడు గస్తీ కాయగలదా? ఒకవేళ లేకపోతే, దానికి కారణమేంటి? ఈ బఫర్ జోన్లు ఎంతకాలం కొనసాగుతాయి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అంతేకాకుండా, "చైనాను చూసి ఎందుకు అంతగా భయపడుతున్నారు? చైనా సరిహద్దుల్లో కాల్పులు జరపకుండా మన సైన్యంపై ఇన్ని ఆంక్షలు ఎందుకు విధించారు? వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ)పై చైనా అవగాహననే బఫర్ జోన్లకు ప్రామాణికంగా మార్చారు" అని ఆయన తీవ్రంగా ఆరోపించారు.గత డిసెంబర్‌లో వచ్చిన 'ది ఎకానమిస్ట్' మ్యాగజైన్‌ను ప్రస్తావిస్తూ ఒవైసీ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. "మీ ప్రభుత్వమే ఆ విదేశీ జర్నలిస్టును లడఖ్‌కు తీసుకెళ్లింది. 2020 నుంచి లడఖ్ సరిహద్దుల్లో చైనా మౌలిక సదుపాయాల అభివృద్ధి రెట్టింపు అయిందని ఆ కథనం పేర్కొంది. మనకంటే నాలుగు రెట్లు వేగంగా చైనా నిర్మాణాలు చేపడుతోందని కూడా తెలిపింది. ఇదంతా జరుగుతుంటే మనం ఎలా అనుమతిస్తున్నాం?" అని ఒవైసీ ప్రశ్నించారు.అంతర్జాతీయ సంబంధాలపైనా ఆయన స్పందించారు. "పాకిస్థాన్‌కు చైనా అందిస్తున్న సైనిక సహకారాన్ని మీరు ఆపగలిగారా? ఒకవేళ ఆపలేకపోతే, చైనాతో మన స్నేహం వల్ల ప్రయోజనం ఏంటి?" అని ప్రశ్నించారు.చివరగా, పార్లమెంటు పనితీరుపై కూడా ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "ఈ కీలక అంశంపై ప్రతిపక్షాలు ప్రశ్నలు అడిగే అవకాశం లేకుండా పార్లమెంటును సజావుగా సాగనివ్వడం లేదని నేను భావిస్తున్నాను. రేపు సభలో గందరగోళం మధ్య పీఎంఓ నుంచి ఒక ప్రకటన వెలువడుతుంది అనుకుంటా" అని పేర్కొన్నారు. "ప్రభుత్వం తనకు సరైనదని భావించినదాన్ని కాకుండా, దేశానికి, ప్రజలకు ఏది మంచో అది చేయాలి" అని హితవు పలికారు. ఒవైసీ ప్రశ్నలు జాతీయ భద్రత, విదేశాంగ విధానంపై మరోసారి రాజకీయ చర్చను రేకెత్తించాయి.

## అమెరికాతో ట్రేడ్ డీల్ ఏపీ ఆక్వా రంగానికి ఒక వరం

ఈ పరిణామంతో సీఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో లాభాల మార్జిన్లు కూడా మెరుగుపడతాయని తెలిపారు. అధిక టారిఫ్ సమయంలో 5-5.5 శాతానికి పడిపోయిన ప్రాసెసర్ల మార్జిన్లు, ఇప్పుడు తిరిగి 7-8 శాతం స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.అమెరికా మార్కెట్ పునరుద్ధరణతో పాటు, యూరోపియన్ యూనియన్, చైనా, వియత్నాం, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి ఇతర మార్కెట్లకు కూడా ఎగుమతులు నిలకడగా కొనసాగుతున్నాయని అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర బడ్జెట్ 2026లో సీఫుడ్ ప్రాసెసింగ్‌కు అవసరమైన ఇన్‌పుట్‌లపై అందించిన సుంకాల రాయితీలు ఈ రంగానికి అదనపు బలంగా నిలుస్తాయని ఆయన గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా 2025-26లో మొత్తం సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు 14-15 లక్షల టన్నులకు చేరుకోవచ్చని మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంపెడా) అంచనాలను ఆయన ప్రస్తావించారు. ఈ టారిఫ్ తగ్గింపు దేశంలోనే సీఫుడ్ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో మేలు చేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం.. వ్యవసాయ ఉత్పత్తులపై కేంద్రం క్లారిటీ

ట్రంప్ పోస్టు నేపథ్యంలో విపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. దీంతో కేంద్రం స్పందించింది.అమెరికా మన దేశానికి ఎగుమతి చేసే వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు మొదటి నుంచి అంగీకరించడం లేదని స్పష్టం చేసింది. వాణిజ్య ఒప్పందం నేపథ్యంలోనూ అదే విషయాన్ని స్పష్టం చేశామని పేర్కొంది. వెనెజువెలా చమురు కొనుగోలు అంశం పరిశీలనలో ఉందని తెలిపింది. ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు మనం వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు చేయలేదని, ఇప్పుడు వాటిని ఎత్తివేశారని పేర్కొన్నారు. చమురు కొనుగోలు చేస్తామన్నారు.అమెరికా నుంచి వచ్చే వ్యవసాయ ఉత్పత్తులు చాలా తక్కువకు వస్తాయి. వాటిపై సుంకాలు తగ్గిస్తే మన దేశంలో రైతులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇంతకాలం వాణిజ్య చర్చల ప్రతిష్ఠంభనకు ఇది ప్రధాన కారణం. మన రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి వాణిజ్యం ఒప్పందం కోసం కేంద్రం ఆసక్తి చూపలేదు. ఇప్పుడు వాణిజ్య ఒప్పందం కుదరడంతో వస్తున్న విమర్శలకు కేంద్రం స్పష్టతనిచ్చింది.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై విపక్షాల ఫైర్

ఇలాంటి కీలక సమాచారం రావడం దేశానికి మంచి సంకేతం కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు.

అమెరికా తన ప్రయోజనాలు లేకుండా ఏ ఒప్పందమూ చేసుకోదని, దీని వెనుక కచ్చితంగా రహస్య ఎజెండా ఉందని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ ఆరోపించారు. "అమెరికా చాలా తెలివైన వ్యాపారి. ఆయుధాల కొనుగోలు లేదా కొన్ని మార్గాల నుంచి చమురు కొనవద్దనే ఒత్తిడి వంటివి దీని వెనుక ఉండొచ్చు. వారు బహిరంగంగా ఒప్పుకోరు కానీ, కచ్చితంగా ఏదో దాగి ఉంది" అని ఆయన అన్నారు.మరో కాంగ్రెస్ ఎంపీ జేబీ మాథర్ మాట్లాడుతూ, "వాణిజ్య ఒప్పందం అయినా, మరో ప్రకటనైనా అన్నీ ట్రంపే చేస్తున్నారు. భారత్ అమెరికాకు లొంగిపోయిందా? ఈ ఒప్పందం చుట్టూ ఎన్నో అనుమానాలు అలుముకున్నాయి. వ్యవసాయ ఒప్పందాలు, రైతుల హక్కుల సంగతేంటి? రష్యా నుంచి కాకుండా వెనిజులా, అమెరికా నుంచి చమురు కొనాలనే ఒత్తిడి నిజమేనా? వీటన్నింటిపై స్పష్టత రావాలి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ప్రభుత్వం సభలో దీనిపై చర్చకు సిద్ధపడాలి" అని డిమాండ్ చేశారు.రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల సంబంధాలను దెబ్బతీసేలా అమెరికా ఒత్తిడి చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ ఉజ్వల్ రామన్ సింగ్ ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్న రష్యా చమురును కాదని, ఎక్కువ ధరకు వెనిజులా నుంచి కొనాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత సోమవారం ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత వస్తువులపై అమెరికా సుంకాలను 18 శాతానికి తగ్గించగా, అమెరికా ఉత్పత్తులపై భారత్ కొన్ని వాణిజ్య అడ్డంకులను సడలించింది. ఈ ఒప్పందంతో భారత ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం చెబుతుండగా, దీనిపై పార్లమెంటులో పూర్తి వివరాలతో కూడిన ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి.

## విద్యుత్, రాగి వైర్ల దొంగతనాల కేసులో ఐదుగురు ముద్దాయిలు అరెస్టు

### రూ.4.40 లక్షల విలువైన చోరీ సొత్తు రికవరీ

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 3)

ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో గ్రానైట్ ఫ్యాక్టరీలలో, పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు, కాలేజీ బిల్డింగ్‌లోని రాగి వైర్లను దొంగలించిన కేసులో ఐదుగురు ముద్దాయిలను బల్లికురవ ఎస్ఐ నాగరాజు మంగళవారం బల్లికురవ పాత బస్టాండ్ వద్ద అరెస్టు చేశారు. అనంతరం స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంతమాగులూరు సిఐ కె వెంకట్రావు కేసు వివరాలు వెల్లడించారు. జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 6 కేసుల్లో రూ.4.40 లక్షల విలువ చేసే 100 కిలోల రాగి తీగను రికవరీ చేయడం జరిగిందన్నారు. అరెస్టు అయిన ముద్దాయిలు కొమరగిరి ప్రసాద్, కాశిమళ్ళ శ్యాంబాబు, ఈగ లక్ష్మి నారాయణ, కల్లూరి ఏసోబు, రావినూతల రాజశేఖర్‌లు. ఈ ఐదుగురు ముద్దాయిలు బాపట్ల జిల్లాకు చెందినవారు. వృత్తిరీత్యా కూలి పనులు చేయడం వలన జీవనోపాధి. అయితే చెడు వ్యసనాలకు బానిసలైన వీరు తమ పని నుండి సరిపడా ఆదాయం రాకపోవడంతో ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. గత రెండు నెలలుగా రాత్రి సమయాల్లో చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ రాగి వైర్లు దొంగిలించి, వాటిని అమ్ముకుని తమ చెడు వ్యసనాలను తీర్చుకునేందుకు ఈ దొంగతనాలను అలవాటు చేసుకున్నారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ముద్దాయిలను గుర్తించి అరెస్టు చేయడం జరిగిందన్నారు. కేసును ఛేధించే విషయంలో స్వయంగా పర్యవేక్షించిన దర్శి బి లక్ష్మినారాయణ, సంతమాగులూరు సిఐ కె వెంకటరావు, బల్లికురవ ఎస్ఐ వై నాగరాజు, సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.










ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

04.02.26    బుధవారం


## పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ పటిష్టంగా నిర్వహించాలి

### సిసిఎల్ఏ ముఖ్య కమిషనర్ జి జయలక్ష్మి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 3)

పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పటిష్టంగా పంపిణీ జరిగేలా చూడాలని సిసిఎల్ఏ ముఖ్య కమిషనర్ జి జయలక్ష్మి జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో రీ సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల రెండవ విడత పంపిణీ, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్‌తో కలిసి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డిఆర్ఓలు, ఆర్డీఓలతో రాష్ట్ర భూ పరిపాలనా శాఖ ముఖ్య కమిషనర్ మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య కమిషనర్ జి జయలక్ష్మి మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. రైతులకు ఎక్కడా ఏ సమస్య రాకుండా పాస్ పుస్తకాల పంపిణీని పూర్తి చేయాలన్నారు. ఒంగోలు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఎస్ఈ ఇరిగేషన్ వరలక్ష్మి, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే ఐదేళ్ళలో బాపట్ల పర్యాటక హబ్‌గా మారనుంది

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఫిబ్రవరి 3)

రానున్న ఐదేళ్లలో బాపట్ల పర్యాటక హబ్‌గా మారనుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. అమరావతి ఆర్థిక మండలిలో భాగంగా జిల్లాలో అభివృద్ధి చేస్తున్న పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు సింగపూర్ ప్రభుత్వ అధికారుల బృందం మంగళవారం జిల్లాకు చేరుకుంది. కలెక్టరేట్ కు వచ్చిన సింగపూర్ ప్రభుత్వ అధికారుల బృందానికి జిల్లాలోని అధికారులు పూల మొక్కలతో ఘనంగా ఆహ్వానం పలికారు. బాపట్ల జిల్లా భౌగోళిక స్వరూపం, వ్యవసాయ, ఆక్వా సాగుపై ఆధారపడిన పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, పర్యాటక రంగం అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్ ను సింగపూర్ ప్రభుత్వ అధికారుల బృందానికి జిల్లా కలెక్టర్ వివరించారు. కోస్తా తీర ప్రాంతమైన బాపట్ల జిల్లాకు వ్యవసాయం, ఆక్వా రంగాల ద్వారా ఏడాది టర్నోవర్ (ఏడాది అమ్మకాల విలువ) రూ.77,579 కోట్లు ఉందని కలెక్టర్ చెప్పారు. బాపట్ల జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.రెండు లక్షల 42 వేల 502 లు ఉందన్నారు. వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ బాపట్ల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రస్తుతం 20 మండలాలు ఉన్న జిల్లా 12 లక్షల 90 వేల 893 మంది జనాభాతో విస్తరించి ఉందని కలెక్టర్ చెప్పారు. 892 కిలోమీటర్ల మేర ప్రధానమైన రహదారులు ఉండగా, 357కిలోమీటర్లు రాష్ట్రీయ రహదారులు ఉన్నాయన్నారు. జల వనరులు అధికంగా ఉన్న బాపట్ల జిల్లాను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు. 5 బీచ్ లు అనుసంధానిస్తూ రహదారులు నిర్మించడం ఇందులో భాగమన్నారు. గుంటూరు నుంచి నిజాంపట్నంకు, పిడుగురాళ్ల నుంచి చీరాల వాడరేవుకు జాతీయ రహదారులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. స్వదేశీ దర్శన్ 2.0 ప్రాజెక్టు పేరుతో రూ.97.52 కోట్లతో సూర్యలంక బీచ్ ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. హౌస్ బోటింగ్ ద్వారా పర్యాటకులు 5 కిలోమీటర్లు బోట్ లో ప్రయాణించేలా పేరలి కెనాల్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కెనాల్ మడ అడవుల మధ్యలో వెళ్తుందని, దీంతో పర్యాటకులు మరింత ఆహ్లాదం, అనుభూతి పొందేలా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తద్వారా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి అత్యధికంగా పర్యాటకులు వస్తారని వివరించారు. హైదరాబాదు నుంచి బాపట్ల వరకు కారవాన్ ఏర్పాటు జరిగిందన్నారు. అత్యంత తక్కువ ధరలోనే పర్యాటకులు సందర్శించే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. సూర్యలంక బీచ్ వద్ద రెండు కిలోమీటర్ల విస్తీర్ణంలో పర్యాటక ప్రాంతంగా మరింత అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర రాజధాని అమరావతి అత్యంత సమీపంలో ఉన్నందున సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. దీంతో పర్యాటకులు సంఖ్య మరింత పెరగనుందన్నారు. ఒక్కొక్క వ్యక్తికి 55 లీటర్ల చొప్పున సురక్షితమైన తాగునీటిని ట్యాప్ కనెక్షన్ల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి (తరువాయి 4లో...)

## రాబోయే ఐదేళ్ళలో ప్రకాశం జిల్లా పారిశ్రామిక హబ్‌గా మారనుంది

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 3)

రాబోవు ఐదేళ్ళలో ప్రకాశం జిల్లా పారిశ్రామిక హబ్‌గా మారనుందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. అమరావతి ఆర్థిక మండలిలో భాగంగా జిల్లాలో అభివృద్ధి చేస్తున్న ప్రాంతాలను సందర్శించేందుకు సింగపూర్ ప్రభుత్వ అధికారుల బృందం మంగళవారం జిల్లాకు చేరుకుంది. తొలుత బృందం రామాయపట్నంను సందర్శించిన అనంతరం ఒంగోలు కలెక్టరేట్ కు వచ్చిన సింగపూర్ ప్రభుత్వ అధికారుల బృందానికి జిల్లాలోని అధికారులు పూల మొక్కలతో ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, సింగపూర్ బృందం సభ్యులతో సమావేశమై ప్రకాశం జిల్లా మరియు మార్కాపురం జిల్లాల భౌగోళిక స్వరూపం, పారిశ్రామిక హబ్ గా మారుటకు గల అవకాశాలు, పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, పారిశ్రామిక అభివృద్ధికి రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ను సింగపూర్ ప్రభుత్వ అధికారుల బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.రెండు లక్షల 16 వేల 305 లు ఉందన్నారు. వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్రప్రదేశ్ విజన లక్ష్యంతో ప్రకాశం జిల్లా ముందుకు వెళ్తున్నామన్నారు. రామాయపట్నం పోర్టు నిర్మాణంతో రానున్న రోజుల్లో ప్రకాశంజిల్లా పారిశ్రామిక హబ్‌గా మారనున్నదన్నారు. జిడివి 59,289.65 కోట్లు కాగా అందులో వ్యవసాయ దాని అనుబంధ రంగాల సెక్టార్ వాటా 25,437.59 కోట్లు, పరిశ్రమల సెక్టార్ వాటా 10,653.82 కోట్లు, సర్వీస్ సెక్టార్ వాటా 23,198.23 కోట్ల రూపాయలని జిల్లా కలెక్టర్ వివరించారు. వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఈ సంవత్సరంలో పూర్తి చేసేలా అన్నీ చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి అయితే పశ్చిమ ప్రకాశం ప్రాంతం ఎంతో పుర్తోగతి సాధిస్తుందన్నారు. రైల్వే, రోడ్డు కనెక్టివిటి కలిగి హైదరాబాదు, చెన్నై, బెంగళూర్, నగరాలకు రవాణా పరంగా ఎంతో అనుకూలంగా ఉన్న జిల్లా ప్రకాశం జిల్లా అని జిల్లా కలెక్టర్ వివరించారు. పరిశ్రమలకు అవసరమైన భూ వనరులు అధికంగా ఉన్న ప్రకాశం జిల్లాను పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దేలా మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు.

65 వేల కోట్ల రూపాయలతో సిబిజడ్ ప్లాంట్, 9,074 కోట్ల రూపాయలతో దొనకొండ హబ్, 60వేల కోట్లతో నేషనల్ ఇన్వెస్ట్మెంట్ అండ్ మానుఫాక్చరింగ్ జోన్, రూ.1.03 లక్షల కోట్ల రూపాయలతో బిపిసిఎల్, రూ.4922 కోట్లతో రామాయపట్నం పోర్ట్ ఫేస్ 1, 69 వేల కోట్ల రూపాయలతో ఇండోసోల్ యూనిట్ జిల్లాలో రావడంతో రానున్న రోజుల్లో ప్రకాశం జిల్లా పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని, అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రుపొందించుకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. (తరువాయి 4లో...)

## పది, ఇంటర్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

### రాష్ట్ర సాంఘీ, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఫిబ్రవరి 3)

సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులందరూ రాబోయే వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సంక్షేమ, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆకాంక్షించారు. మంగళవారం మధ్యాహ్నం సచివాలయం నుండి రాష్ట్ర డైరెక్టర్ లావణ్య వేణితో కలిసి రాష్ట్రంలోని డిప్యూటీ డైరెక్టర్లు, డిఎస్‌సిడబ్ల్యు అండ్ ఈఓలతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

**40 రోజుల ప్రణాళిక :** పదో తరగతి పరీక్షలకు కేవలం 40 రోజులే సమయం ఉన్నందున, ప్రతి నిమి షాన్ని విద్యార్థుల ప్రగతికి ఉపయోగించాలి. 100% ఉత్తీర్ణత సాధించడమే మన తక్షణ కర్తవ్యం.

**గ్రేడింగ్ మెరుగుదల :** విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి ప్రత్యేక శ్రద్ధ వహించాలి. 'డి' గ్రేడ్ విద్యార్థులు 'సి' కి, 'సి' వారు 'బి' కి, 'బి' గ్రేడ్ విద్యార్థులు 'ఏ' గ్రేడ్ సాధించేలా ఉపాధ్యాయులు, అధికారులు ప్రోత్సహించాలి. (తరువాయి 5లో...)

# రాబోయే ఐదేళ్ళలో ప్రకాశం జిల్లా పారిశ్రామిక హబ్‌గా మారనుంది





రామాయపట్నం పోర్టును సందర్శించిన సింగపూర్ బృందం

రామాయపట్నం పోర్టును సింగపూర్ నుంచి వచ్చిన ప్రభుత్వ ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. అమరావతి ఎకనామిక్ రీజియన్‌లో భాగంగా ప్రకాశం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వీరు వచ్చారు. ఇందులో భాగంగా తీర ప్రాంతంలో కీలకమైన ఈ పోర్టు నిర్మాణ పురోగతిని పరిశీలించి నిర్వహణ సామర్థ్యం, లభించే ఉపాధి అవకాశాలు, విస్తరణ ప్రణాళికలు, దీని ఆధారంగా చుట్టుపక్కల జరిగే అభివృద్ధి, పోర్టుకు అనుసంధానమైన రోడ్డు, రైలు రవాణా సౌకర్యాల గురించి పోర్టు అధికారులతోనూ, భూ సేకరణ అధికారులతో చర్చించారు. ఆ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు తెలియజేయగా సింగపూర్ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ ఎకానమిక్ కన్సల్టెంట్ ప్రైస్ సీఈవో చూతోక హిమ్, సింగపూర్ కోపరేషన్ ఎంటర్ ప్రైజ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ చువా, సింగపూర్ సస్టైనబిలిటీ స్టాటజిక్ ప్రాజెక్ట్ సీనియర్ మేనేజర్ నిషశర్ధ, రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక శాఖ డైరెక్టర్ బి గోపాల్, కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశీ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, వివిధశాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రాబోయే ఐదేళ్ళలో బాపట్ల పర్యాటక హబ్‌గా మారనుంది







18 మండలాలకు జలవనరులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసంధానంతో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రతి ఏటా బాపట్లలో 4.21 లక్షల మెట్రిక్ టన్నుల ఆక్వా ఉత్పత్తి జరుగుతుందని, ఆక్వా సాగు విస్తీర్ణం రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా ఆరవ స్థానంలో నిలిచిందన్నారు. దేశంలో గోవా బీచ్ మాదిరిగా బాపట్ల సూర్యలంక బీచ్ ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం అభినందనీయమని దక్షిణాసియా మిడ్డిల్ ఈస్ట్ అండ్ ఆఫ్రికా, సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చాంగ్ తెలిపారు. అమరావతి ఆర్థిక మండలి అభివృద్ధిలో భాగంగా మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అధికారుల భాగస్వామ్యం అమోఘం అన్నారు. జల వనరులు జిల్లాలో ఉన్నప్పటికీ పర్యాటక ప్రాంతంలో తాగునీరు సమృద్ధిగా సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలతో ముందుకు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. పిపిటి ద్వారా అభివృద్ధిపై రూపొందించిన ప్రణాళిక చాలా బాగుందన్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి జల వనరులను తెచ్చేందుకు సిద్ధం చేసిన ప్రణాళిక అద్భుతంగా ఉందని, ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆక్వా ఉత్పత్తులు బాపట్లలో అత్యధికంగా ఉండడం, ఇక్కడ నుంచి అమెరికా దేశానికి సైతం ఎగుమతి చేయడం అభినందనీయమన్నారు. అక్కడి ప్రభుత్వం నుంచి నేరుగా క్రయవిక్రయాలు జరుగుతున్నాయా...? లేదా ఏజెంట్లు, బయ్యర్లు వస్తున్నారా అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్య సంపద అధికంగా ఉత్పత్తి జరుగుతున్న నేపథ్యంలో నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయా, ప్రాసెసింగ్ యూనిట్లు సామర్థ్యంపై వివరాలు తెలుసుకున్నారు. బాపట్ల సూర్యలంకకు కారవాన్ ఏర్పాటు కావడం చాలా శుభ పరిణామం అన్నారు. బీచ్ ల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో సింగపూర్ ఎకానమిక్ కన్సల్టెంట్ ప్రైస్ సీఈవో చూతోక హిమ్, సింగపూర్ కోపరేషన్ ఎంటర్ ప్రైజ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ త్యాలైన్ చీవో, సింగపూర్ సస్టైనబిలిటీ స్టాటజిక్ ప్రాజెక్ట్ సీనియర్ మేనేజర్ నిషశర్ధ, రాష్ట్ర ఆర్థిక ఘనంగా శాఖ డైరెక్టర్ బి గోపాల్, వివిధశాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పది, ఇంటర్ ఫలితాల్లో
# నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



స్టడీ మెటీరియల్ : ప్రభుత్వం అందించిన 'షైనింగ్ స్టార్' 'రైజింగ్ స్టార్' పుస్తకాలను విద్యార్థులతో క్షుణ్ణంగా చదివించాలి. ఇవి పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి ఎంతో దోహదపడతాయి.

ఇంటర్మీడియట్ ఫలితాలు : ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులందరూ తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలి. ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి వారిని ఉన్నత చదువుల వైపు మళ్ళించాలి. పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ఎంసెట్ ప్రవేశ పరీక్షలపై ఇప్పటి నుండే అవగాహన కల్పించాలి.

ఆరోగ్యం – పారిశుధ్యం : పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యం చాలా ముఖ్యం. వసతి గృహాల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించడంతో పాటు, పారిశుధ్యం విషయంలో ఎటువంటి రాజీ పడకూడదు.

కుటుంబ సభ్యుల్లా చూడాలి : హాస్టల్‌లో చదువుతున్న ప్రతి విద్యార్థిని మన కుటుంబ సభ్యుడిగా భావించి బాధ్యత తీసుకోవాలి. జిల్లాలోని డిప్యూటీ డైరెక్టర్లు తమ పరిధిలోని ఏఎస్‌డబ్ల్యుఓస్, హెచ్‌డబ్ల్యుఓస్ కు తగిన దిశానిర్దేశం చేసి, ఈ లక్ష్యాలను అమలు చేయాలి. విద్యార్థుల భవిష్యత్తు కోసం అధికారులు, హాస్టల్ వార్డెన్లు పూర్తి అంకితభావంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

# గంజాయి రవాణా పై ఉక్కుపాదం లారీ యూనియన్
## కార్యాలయం వద్ద పోలీసులు ప్రత్యేక అవగాహన సదస్సు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)**

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీసుశాఖ ముమ్మర చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఒంగోలు పట్టణంలోని లారీ యూనియన్ కార్యాలయం వద్ద గంజాయి వినియోగం, అక్రమ రవాణా పై లారీ యజమానులు, డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి సీఐ సుధాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మహబూబ్ బాషా, ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ ముస్తఫా, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీసు సిబ్బంది మాట్లాడుతూ ప్రయాణాల్లో అపరిచిత వ్యక్తులను గానీ, వారి లగేజీని గానీ లారీల్లోకి ఎక్కించుకోవద్దన్నారు. ఒకవేళ వారి వద్ద గంజాయి ఉంటే, తెలియక ఎక్కించుకున్నా సరే చట్టప్రకారం డ్రైవర్లు కూడా శిక్షార్హులవుతారన్నారు. లారీ యజమానులు తమ వద్ద పనిచేసే డ్రైవర్ల పూర్వాపరాలను పరిశీలించి, నమ్మకస్తులైన వారిని మాత్రమే నియమించుకోవాలన్నారు. యజమానులకు తెలియకుండా డ్రైవర్లు గంజాయి రవాణాకు పాల్పడితే, సదరు వాహనాలను పోలీసులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. గంజాయి అమ్మడం, కలిగి ఉండటం లేదా సేవించడం నేరమని, దీనివల్ల డ్రైవర్ల కెరీర్ మరియు కుటుంబాలు నాశనమవుతాయన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా గురించి ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులు ౹టోల్ ఫ్రీ నంబర్: 1972, డయల్ 112, పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266 కు సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ తరపున ప్రెసిడెంట్ కల్లూరి అంజిబాబు, సెక్రెటరీ కొమ్మూరి ప్రసాద్, ట్రెజరర్ వేమూరి శ్రీనివాసులు, నాడారి నాగరాజు, పెద్ద సంఖ్యలో డ్రైవర్లు, కార్మికులు హాజరయ్యారు.







# విద్యార్థినులకు కళ్లద్దాలు పంపిణీ
## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 3)**

జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న 2,974 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థినులకు కలెక్టర్ కళ్లద్దాలు పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడితేనే వారి విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి విజయమ్మ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రత్నమోహన్‌తో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




# ఫిబ్రవరి 12 న జరిగే సార్వత్రిక సమ్మెలో మహిళలంతా పాల్గొనాలి
## ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)**

కార్మిక వర్గం పోరాటాలతో సాధించుకున్న చట్టాలను కోడ్లు గా మార్చి, నిరంకుశంగా వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెకు ఐద్వా సంపూర్ణంగా మద్దతిస్తున్నదని జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. సమ్మెకు సంబంధించిన కరపత్రాలను నగరంలోని చైతన్య కాలనీలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రుణాలు మాఫీ చేస్తూ, వేలకోట్లు సబ్సిడీలు ఇస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ల కు తెగనమ్మే విధానాలను మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్నదని అన్నారు. కనీస వేతన చట్టం, 8 గంటల పని విధానం, సమ్మె చేసే హక్కు, కార్మికులు పోరాటాలతో సాధించుకున్న అనేక సౌకర్యాలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అన్నారు. గ్రామీణ పేదలకు ఆసరాగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి, పేదల పొట్ట కొట్టే విధంగా కొత్త చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. కనీస మద్దతు ధరల చట్టం కోసం రైతులు చేస్తున్న పోరాటాన్ని పరిశీలించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని అన్నారు. కార్మికులు, కర్షకులు, కష్టజీవులు చేస్తున్న ఉద్యమాల్లో మహిళలు కూడా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి, నగర కమిటీ సభ్యులు డి తిరుపతమ్మ, డి మధురవాణి, డి నాగమణి, ఐద్వా నాయకులు శ్రావణి, సువార్త ఎ నాగేంద్రమ్మ, ఎ మార్తమ్మ, ఎ సుబ్బరత్నం, పి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్1, గ్రూప్2 పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన పోలీస్ శాఖ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)**

ప్రకాశం జిల్లా పోలీస్ శాఖలో ఎఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న హుస్సేన్ కుమార్తె రిజ్వానా ఏపిపిఎస్‌సి గ్రూప్1 ఫలితాలలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఎంపిక కావడం గర్వకారణమని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. అదే విధంగా గ్రూప్2 ఫలితాలలో స్పెషల్ పార్టీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లు కె అశోక్‌రెడ్డి డిప్యూటీ తహసీల్దార్‌గా, కె వెంకటేశ్వర్లు, కె సూర్యతేజలు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రకాశం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జిల్లా ఎస్పీ పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపి బహుమతిలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇదే పట్టుదల, క్రమశిక్షణ, కఠోర కృషితో భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. దృఢ సంకల్పం, సరైన ప్రణాళిక, సమయ పాలనతో పాటు నిరంతర అధ్యయనం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చున్నారు. గ్రూప్1, గ్రూప్2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంలో ముఖ్యపాత్ర పోషించిన తల్లిదండ్రులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పోలీస్‌శాఖలో పనిచేస్తున్న సిబ్బంది తమ పిల్లలకు క్రమశిక్షణ, నైతిక విలువలు, సరైన మార్గదర్శనం అందిస్తూ చదువులో ప్రోత్సహించాలని సూచించారు. అలా చేస్తే వారు ఉన్నత స్థాయికి చేరుకోవడమే కాకుండా సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామరెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.







# పిజిఆర్ఎస్, రీసర్వే, మ్యుటేషన్, వెబ్ ల్యాండ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**జిల్లాలో రీ సర్వే జరుగుతుంది**
**పాస్ బుక్స్, కెవైసి, ఆర్ఓఆర్ కేసులు పెండింగ్ లేకుండా చూడాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఫిబ్రవరి 3)

పిజిఆర్ఎస్, రీసర్వే, మ్యుటేషన్, వెబ్ ల్యాండ్ పై రెవిన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. రెవిన్యూ అంశాలకు సంబంధించి మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ భావన, డిఆర్ఓ జి గంగధర్ గౌడ్‌తో కలసి జిల్లాలో జరుగుతున్న రెవిన్యూ సేవలు, పిజిఆర్ఎస్, రీసర్వే, మ్యుటేషన్, వెబ్ ల్యాండ్, ఆర్ఓఆర్, పాస్ బుక్స్, కేవైసి, రీసర్వే తదితర అంశాల పై ఆర్డీఓలు, తహశీల్దార్లుతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చాలా మంది అధికారులు వస్తుంటారు పోతుంటారు ప్రజలకు మంచి చేస్తే ఇప్పటికి గుర్తు పెట్టుకుంటారాని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న రెవిన్యూ సేవలో ముఖ్యమైనవి పిజిఆర్ఎస్, రీసర్వే, మ్యుటేషన్, వెబ్ ల్యాండ్ పై రెవిన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. రీ సర్వే బాగా చేయాలని రీ సర్వే సంబంధించి ప్రజా సానుకూలత బాగుండే విధంగా మండల గ్రామస్థాయి అధికారులు పనిచేయాలన్నారు. ఆర్డీఓల పరిధిలోని ఉన్న మండలంలో ఆర్డీఓలు పర్యటించి పరిశీలించాలని, అదే విధంగా మండల పరిధిలో ఉన్న గ్రామాలలో తాసిల్దారులు వెళ్లి గ్రామస్థాయిలో పరిశీలించాలని, అప్పుడే రెవెన్యూ సమస్యలు తొందరగా పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. పిజిఆర్ఎస్, రీసర్వే, మ్యుటేషన్, వెబ్ ల్యాండ్, రీసర్వే, పాస్ బుక్స్, కెవైసి, ఆర్ఓఆర్ కేసులు, పట్టాదారు, ఆధార్ సీడింగ్ వంటివి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఆర్ఓఆర్ కేసులు షెడ్యూల్ వేసుకొని పరిష్కరించాలని తహశీల్దార్లును ఆదేశించారు. ఈ సందర్భంగా మండలాల వారిగా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఆర్ఎస్ డిటీలు, మండల సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.







## తేనేటి విందుకు హాజరైన మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)

మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు మంగళవారం సాయంత్రం ఒంగోలు చెన్నకేశవ స్వామి లేఔట్‌లోని ప్రముఖ వ్యాపారవేత్త మండవ మురళీకృష్ణ నివాసానికి తేనేటి విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండవ మురళీకృష్ణ కుటుంబ సభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు సన్నిహితులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ రోజున తన పరిచయస్తులు అందరిని కలుసుకోవటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన మండవ మురళీకృష్ణని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా తమ నివాసానికి విచ్చేసిన డాక్టర్ వెంకటేశ్వరరావు ని మండవ మురళీకృష్ణ కుటుంబ సభ్యులు ఆయన ఆత్మీయులు శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శేషయ్య, బాలిన రామ సుబ్బారావు, ఈదర మోహన్, ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, మండవ సుబ్బారావు, ఎం వివేకానంద, గట్టినేని అయ్యన్న, ఆలా హనుమంతరావు, పోతినేని శ్రీనివాసరావు (పియస్ఆర్), పాటిబండ్ల వెంకటేశ్వర్లు, రావుల పద్మజ, నంబూరి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 3)



స్వచ్ఛత నుంచి స్వయం పోషణ వరకు పెద్దనాగులవరంలో మ్యాజిక్ డ్రమ్స్, కిచెన్ గార్డెన్‌ల పై అవగాహన పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి గ్రేడ్ 4, గ్రేడ్ 5 ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో రెండవ రోజు భాగంగా మంగళవారం మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం గ్రామపంచాయతీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి బాల చెన్నయ్య నేతృత్వం వహించగా, గ్రామ స్వచ్ఛత, పోషణ, ఆరోగ్య పరిరక్షణకు దోహదపడే మ్యాజిక్ డ్రైన్స్, సోప్ పిట్స్, కిచెన్ గార్డెన్ నిర్మాణాలు, వాటి వల్ల కలిగే ఉపయోగాలను గ్రామ ప్రజలకు సులభంగా వివరించారు.గ్రామాల్లో వ్యర్థాల నిర్వహణ, ఇంటింటా పోషకాహార భద్రత, పరిశుభ్రత పెంపొందించడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమంలో టివోటిలు పి శోభన్ బాబు, ఏ రామకృష్ణ, శేషగిరిరావు, పంచాయతీ అభివృద్ధి అధికారి బి వెంకటేశ్వర్లు, ఏపీవో నాగరాజు, ఈసీ బెల్లంకొండ కిషోర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్లు, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామాభివృద్ధిలో పంచాయతీ వ్యవస్థ కీలక పాత్రను మరోసారి చాటిన ఈ శిక్షణ కార్యక్రమం అందరి ప్రశంసలు పొందింది.

# ప్రగతి కాలనీలో పోలీసుల 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్

**గంజాయి రహిత సమాజం దిశగా భారీ ర్యాలీ, ప్రతిజ్ఞ**




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో తాలూకా పోలీస్ స్టేషన్ సిఐ విజయ్ కుమార్ ఒంగోలు పట్టణంలోని ప్రగతి కాలనీలో పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను పరిరక్షించడం, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, ముఖ్యంగా మాదకద్రవ్యాల కట్టడి లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్ సందర్భంగా కాలనీలోని అనుమానిత ప్రాంతాలను పోలీసులు జల్లెడ పట్టారు. స్థానిక ప్రజలతో మమేకమై, వారి ప్రాంతంలో ఏవైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయా అనే అంశంపై ఆరా తీశారు. అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

తనిఖీల అనంతరం గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి విక్రయించినా లేదా వినియోగించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి "డ్రగ్స్ రహిత సమాజం" కోసం పోలీసులు ప్రతిజ్ఞ చేయించారు. ప్రగతి కాలనీ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. "గంజాయి వద్దు – జీవితం ముద్దు" అంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. ప్రజల సహకారం ఉంటేనే నేరరహిత సమాజాన్ని నిర్మించగలమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు మరియు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. 23 ద్విచక్ర వాహనాలను రెండు ఆటోలను తనిఖీ చేసి పత్రాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పట్టణ పోలీస్ అధికారులు, భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుంది

**మాజీమంత్రి, కొండపి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్**




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఫిబ్రవరి 3)

గ్రామాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసి కష్టపడే ప్రతి కార్యకర్తకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని మాజీ మంత్రి కొండపి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం ఆవరణంలో మంగళవారం జడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈసారి పార్టీ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యకర్తలకు పెద్దపీట వేసి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు కల్పిస్తామన్నారు. పార్టీలో ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అంతర్గత విభేదాలు వీడి వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ నెల 18 లోపు గ్రామ కమిటీల నిర్మాణం పూర్తి చేసి బూత్ కమిటీలను కూడా పటిష్టం చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు గుర్తింపు కార్డు తో పాటు ఐదు లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు స్థానిక సంస్థ ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ సత్తా చాటటానికి అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. అలాగే 2029 ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురువేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి తిరుపతిరెడ్డి, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, కాటా మాధవరావు, మన్నెం వెంకటేశ్వర్లు, జైష్ట వేణు, పచ్చవ వంశీ, వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలని కోరుతూ ధర్నా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)



ఒంగోలు నగరపాలక సంస్థ నందు పారిశుధ్య విభాగంలో గత 8 సంవత్సరాల నుండి పనిచేస్తున్న కోవిడ కార్మికులను ఆప్కాస్ లో తీసుకోవాలని, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం స్థానిక ఒంగోలు నగరపాలక సంస్థ నందు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ యూనియన్ ఒంగోలు నగర్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు టి మహేష్ మాట్లాడుతూ కోవిడ్, ప్రకృతి, వైపరీత్యాలు , తుఫాను ఇలాంటి సందర్భాల్లో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా నిలబడి విధులు నిర్వహిస్తున్నారు. అయితే పారిశుధ్య భాగంలో పనిచేస్తున్న కార్మికులకు ఒకే తరహా వేతనాలు చెల్లించటంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని తెలియజేశారు. పర్మినెంట్ ఉద్యోగులకి ఒక తరహా వేతనం, ఆప్కాస్ పనిచేస్తున్న కార్మికులకి ఒక వేతనం , కోవిడ, అదనపు కార్మికుల కింద పనిచేస్తున్న పారిశుద్ధి కార్మికులకు అతి తక్కువ వేతనాలు రూ.15వేలు చెల్లిస్తున్నారు. ఈ రోజు వేతనాలు తారతమ్యాలతో చెల్లించటం దుర్మార్గ చర్యని అన్నారు. ఒకే తరహా పని చేసే కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన ప్రభుత్వాలు కానీ, పాలకవర్గాలు కానీ పట్టించుకునే అమలు చేయడంలో మేన మీసాలు లెక్కేస్తున్నారు. కోవిడ్ కార్మికులకు ఆప్కాస్‌లో తీసుకుంటామని గత ప్రభుత్వం చెప్పింది. ఆచరణలో అమలు చేయలేదన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు అధికారంలోకి వచ్చిన నేటికీ పూర్తవుతున్న ఏ ఒక్క కార్మికుని ఆప్కాస్ తీసుకోలేదు. కానీ కూటమి పార్టీ కార్యకర్తలను విధుల్లో తీసుకున్నారు. ఒక వైపు చనిపోయిన కార్మికులు, అనారోగ్యం వాళ్ళ కుటుంబ సభ్యుల్ని విధుల్లో తీసుకోవాలని చెప్పిన, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు విని విన్నట్లు వ్యవహరిస్తున్నారు. గత ఎనిమిది సంవత్సరాల నుండి పనిచేస్తున్న కోవిడ్ కార్మికులును, ఆప్కాస్‌లో తీసుకోవాలని యూనియన్ గా అనేక దఫాలుగా విన్నవించినా పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆప్కాస్‌లో ఖాళీ అయిన కార్మికుల స్థానాల్లో మొదటి ప్రాధాన్యం కోవిడ్ కార్మికులకు, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఆప్కాస్‌లోకి తీసుకోవాలని లేని పక్షంలో భవిష్యత్తులో కార్మికులను ఐక్యం చేసి పోరాటానికి సన్నద్ధమవుతారని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యు రత్నం కుమారి మాట్లాడుతూ కోవిడ్ కార్మికులకు కనీసం వేతనాలు అమలు చేయలేకపోతున్నారు. సౌకర్యాలు కల్పించడం లేదు, సెలవులు అడిగితే మీరు కోవిడ్ కార్మికులు, మీకు సెలవులు లేవు, మీరు సెలవు పెడితే ఉన్న పని కూడా పోయిద్ది అని మున్సిపల్ అధికారులు బెదిరింపు చర్యలకు దిగుతున్నారన్నారు. కోవిడ్ కార్మికులకు కూడా సెలవులు ప్రకటించాలని కోరారు. నిరసన ధర్నా అనంతరం మున్సిపాలిటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై రవికుమార్, ఎం బాబు, కె వంశీ, బి జేమ్స్, ఆర్ కోమలి, మరియమ్మ, కే పద్మ, వి భారతి, కమల, వాసు, అనిల్, దేవిడ్, తిరుపాలు, కల్పన, సుధా, అంజమ్మ, సత్యవతి, నాగమణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.




# యువత నైపుణ్య అభివృద్ధి తోనే ఉద్యోగ భవిష్యత్తు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)

యువతకు ఉద్యోగాలు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు జిల్లా రూట్ సెట్ సీనియర్ ఫ్యాకల్టీ యువికె బాపూజీ తెలియజేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ముండ్లమూరు మండల వెలుగు మహిళా సమైక్య కార్యాలయం నందు యువతకు ఉద్యోగ, ఉపాధి, నైపుణ్య అభివృద్ధి అంశాల పై మండల సదస్సుకు డిబిఆర్సి జిల్లా కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ యువత తమ ఆసక్తి అభిరుచులకు అనుగుణంగా శిక్షణ పొందితే ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. మా సంస్థ కంప్యూటర్ కోర్సులు, టెక్నికల్ ట్రైనింగ్, ఎంటర్ ప్రేనూర్ షిప్ దెవలప్మెంట్, హ్యాండ్లీ క్రాఫ్ట్, ఆగ్రో ఆదాయం పరిశ్రమలు, సేవా రంగాలలో శిక్షణ అందిస్తున్నట్లు ఆయన అన్నారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు ఉద్యోగమేళాలు, బ్యాంకు రుణాల అనుసంధానం, స్వయం ఉపాధికి మార్గం నిర్దేశం అందించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల వెలుగు మహిళా సమైక్య ఏపీఎం ఎం హనుమంతరావు మాట్లాడుతూ వెలుగు పథకం ద్వారా యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణలు, లభిస్తాయి. కంప్యూటర్ శిక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్ వ్యవసాయ ఆధారిత ఉపాధులు వంటి శిక్షణలతో యువత తమ జీవనోపాధిని స్వయంగా మహిళలు ఆర్థికంగా స్వాలంబలన అవుతూ కుటుంబ ఆదాయం పెరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్యలు తగ్గుముఖం పడుతుందని ఆయన అన్నారు. మండల ఉపాధి హామీ పథకం ఏపీవో టి వెంకట్రావు మాట్లాడుతూ యువతకు స్థిరమైన ఆదాయం వలస నివారణ గ్రామీణ మౌలిక వసతులు సదుపాయాలు అభివృద్ధి పంటల ద్వారా ఉపాధి లభిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ కే వెంకటేష్, ఎఫర్ట్ ఎన్జీవో ప్రతినిధి జెస్సి గ్లోరీ, డిబిఆర్‌సి ప్రతినిధి టీ దేవిడ్, మండలంలోని వివిధ గ్రామాల నుండి నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారు.

# విల్లేజ్ క్లినిక్‌లకు స్థలాలు వెంటనే కేటాయించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 3)

జిల్లాలో ప్రతి సచివాలయ పరిధిలో ఏర్పాటు చేయనున్న విల్లేజ్ క్లినిక్‌లకు ప్రతిపాదించిన స్థలాలను వెంటనే వైద్య, ఆరోగ్యశాఖకు అప్పగించి నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి హైబ్రిడ్ విధానంలో తహసీల్దార్లు, ఆర్డీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 30 ప్రాంతాల్లో ఇప్పటివరకు స్థలాలు ఖరారు కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదని కలెక్టర్ తెలిపారు. ఈ




విషయంలో నిర్లక్ష్యంగా ఉన్న కొందరు తహసీల్దార్లపై అసహనం వ్యక్తం చేశారు. స్థలాలు కేటాయించని చోట్ల వెంటనే స్థలాలను గుర్తించి, వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కొంతమంది తహసీల్దార్లతో కలెక్టర్ నేరుగా మాట్లడారు. స్థలాలు చూపించకపోతే పూర్తి బాధ్యత తహసీల్దార్లదేనని కలెక్టర్ హెచ్చరించారు. పనులు ప్రారంభమైన ప్రాంతాల్లో ప్రతివారం పనుల పురోగతికి సంబంధించిన ఫొటోలను అప్‌డేట్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన, డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆపస్ ఆవిర్భావ దినోత్సవం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)

దేశ హితం కోసం విద్య, విద్య హితం కోసం ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ హితం కోసం సమాజం అనే ధ్యేయ వ్యాఖ్య స్ఫూర్తితో పని చేస్తూ జాతీయ భావాల ప్రాతిపదికగా ఉపాధ్యాయుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, విద్యార్థులలో దేశభక్తి, జాతీయ సమైక్యత, ఆత్మవిశ్వాసం పెంపొందింప చేస్తూ వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం 1982 ఫిబ్రవరి రెండవ తేదీన ఆవిర్భవించిందని ఆపస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సిహెచ్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం 45వ ఆవిర్భావ దినోత్సవం ఒంగోలులోని ఆ సంఘ కార్యాలయంలో ఆపస్ జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1984లో రిజిస్టర్ కాబడి 2004వ సంవత్సరంలో ప్రభుత్వం గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయ సంక్షేమం కోసం చేసిన అనేక పోరాటాల ఫలితంగా 2022లో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నందు శాశ్వత సభ్యత్వం, వైద్యశాఖ స్టీరింగ్ కమిటీ, మేనేజ్మెంట్ కమిటీ సభ్యత్వం పొంది మరింత బాధ్యతాయుతంగా నూతన ఉత్సాహంతో ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే మల్లికార్జునరావు, దిలీప్, చక్రవర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిహెచ్ హిమజ, జిల్లా బాధ్యులు గుణ ప్రసాద్, నరసింహారావు, పి రవి శంకర్, శేషారావు, మార్కండేయులు, ఆనంద్, చంద్రశేఖర్, ఫణీంద్ర, కుమార్, వై వెంకటేశ్వర్లు, వై వెంకట్రావు, నాగ కుమార్, శర్మ, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

# జాయింట్ డైరక్టర్‌గా సురేష్ కుమార్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)

జాయింట్ డైరెక్టర్‌గా పదదోన్నతి పొందటమే కాకుండా కీలకమైన బాధ్యతల్లో కి వెళ్తున్న జిజిహెచ్ డిప్యూటీ డైరెక్టర్ సురేష్ కుమార్ సేవలు రాష్ట్ర స్థాయిలో ప్రజలకు ఉపయోగపడాలని జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు అన్నారు. జిజిహెచ్‌లో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సురేష్ కుమార్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో సురేష్ కుమార్ ను ఘనంగా సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. జిజిహెచ్‌లో పని చేసినంత కాలంలో ఎంతో ఓర్పుతో పని చేసారు అని, కీలకైనా విభాగంలోకి వెళ్తున్న నేపథ్యంలో అయన మరింత పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది, వైద్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ అద్దయ్య, డిప్యూటీ సూపరెంటెండెంట్‌లు డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ మాధవిలత, ఏఓ ప్రసాద్, బాలకృష్ణ, జయ ప్రకాష్, నియాజ్ భాష, ఆఫీస్ అడ్మినిస్ట్రేటర్‌లు శేష వర్ధిని, సిబ్బంది శ్రీనివాస యాదవ్, బాబురావు, శ్రీహరి, తిరుపతిరావు, ప్రదీప్, షఫీ, వెంకట్రావు , ధనుంజయ్, పద్మ, రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన మహిళా పరిశ్రమలు, వ్యాపారాల అభివృద్ధి పథకాల పై మాగుంట ప్రశ్న

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)

దేశం, ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన మహిళల పరిశ్రమల, వ్యాపారాల అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు, లబ్దిదారులు, అవగాహన పెంపు చర్యల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయక మంత్రి దుర్గాదాస్ ఉయ్ కే సమాధానమిస్తూ గిరిజన మహిళలు నూతన పరిశ్రమలు, వ్యాపారాలు ఏర్పాటు చేయుటకు, ఉన్నవాటి అభివృద్ధికి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్మెంట్ ఫెడరేషన్, నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్సు డెవలప్మెంట్ కార్పోరేషన్ సంస్థల ద్వారా ఆర్థిక సహాయం రుణాలతో పాటు గిరిజన ఉత్పత్తులు, అమ్మకాల అనుసంధానికి గిరిజన కళాకారులు, సరఫరాదారులకు కావలసిన వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రధాన్‌మంత్రి జన జాతీయ వికాస్ మిషన్ పథకం క్రింద దేశం మొత్తంలో 4,125 పరిశ్రమలకు రూ. 61,212 లక్షలు ఆర్థిక సహాయం మంజూరు చేయబడగా, 12,33,328 మంది గిరిజన మహిళలు లబ్ధిపొందగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి 415 పరిశ్రమలకు, రూ. 6,163 లక్షలు ఆర్థిక సహాయం మంజూరు చేయబడగా, 1,23,258 మంది లబ్ధిపొందారుని తెలిపారు. ప్రదాన్ మంత్రి జన్ మన్ జాతీయ వికాస్ మిషన్ పథకం క్రింద దేశం మొత్తంలో 539 పరిశ్రమలకు, రూ. 2,298 లక్షలు ఆర్థిక సహాయం మంజూరు చేయబడగా, 45,924 మంది గిరిజన మహిళలు లబ్ధిపొందగా, ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి 1 పరిశ్రమకు, రూ.3 లక్షలు ఆర్థిక సహాయం మంజూరు చేయబడగా, 56 మంది లబ్ధిపొందారుని తెలిపారు. నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్సు డెవలప్మెంట్ కార్పోరేషన్ ద్వారా గత 3 సం.లో దేశం మొత్తంలో 2,14,182 మందికి రూ.91,478 లక్షలు రుణాలు ఇవ్వగా, ఆంధ్రప్రదేశ్ లో 53,789 మందికి రూ.15,710 లక్షలు రుణాలు ఇవ్వబడ్డాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

## జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు

### జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 3)

మార్కాపురం జిల్లాలో రెవెన్యూ సమస్యలను పరిష్క రించడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టిందని జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామంలో రైతులకు జాయింట్ కలెక్టర్ పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమ కోసం భూముల రీ సర్వే చేపట్టి కొత్త పాస్ పుస్తకాలను రైతులకు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం చేసిందని ఆయన చెప్పారు. కొత్తగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పాస్ పుస్తకాలపై క్యు ఆర్ కోడ్ ను ప్రభుత్వం ముద్రించిందని దీని ద్వారా భూమి యొక్క వివరాలను రైతులు తెలుసు కోవచ్చునని ఆయన చెప్పారు. కొత్తగా పంపిణీ చేసిన పాస్ పుస్తకాలలో ఏమైనా పొరపాట్లు ఉంటే తిరిగి అర్జీలు వచ్చునని వాటిని సరి చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ప్రభుత్వం రాజముద్ర తో పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శివరామిరెడ్డి, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రుల ఇళ్లపై దాడి దుర్మార్గపు చర్య

### రాష్ట్ర వైఎస్ఆర్సిపి సంయుక్త కార్యదర్శి వెలిచర్ల ధనకోటి

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 3)



ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతూ ప్రశ్నించిన నాయకులు పై కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకు పంపటం దుర్మార్గమైన చర్య అని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెలిచర్ల ధనకోటి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం నడవటం లేదు, కూటమి ప్రభుత్వం సృష్టించిన రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వాళ్ళ ఇళ్ళ పై దాడి చేసి పెట్రోల్ బాంబులు వేసి ఇళ్లను తగలబెట్టడం కూటమి ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందన్నారు. పవిత్రమైన తిరుమల లడ్డులో జంతువు కొవ్వు, కల్తీ జరిగిందని విష ప్రచారం చేయటం తగదన్నారు. మాజీ మంత్రుల ఇళ్లపై పోలీసుల సమక్షంలో దాడి చేయడాన్ని రాష్ట్రంలోని మేధావులు, విద్యావంతులు, ప్రజాస్వామికవాదులు, కమ్యూనిస్టులు అందరూ ఖండించాలని కోరారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అతి త్వరలో రాష్ట్రంలోని ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు.

## దేశవ్యాప్త సమ్మెకు పిలుపు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

### ఆశా వర్కర్లను కార్మికులగా గుర్తించి రూ.26 వేల కనీసం వేతనాన్ని ఇవ్వాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 3)

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అన్ని రకాల సెలవులు మంజూరు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఆషాల నియామకం ప్రభుత్వమే చేపట్టాలని, ఆరోగ్య రంగానికి జిడిపిలో 6% శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వం రంగం సంస్థలు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్స్ మీద ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాల, స్వతంత్ర ఫెడరేషన్ లు పిలుపునిచ్చాయి. ఆశా వర్కర్స్ సమ్మె లో పాల్గొనాలని చీమకుర్తి యూ పి హెచ్ సి మరియు బండ్లమూడి పిహెచ్సి డాక్టర్ పి హరిణి గారికి సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం కార్మికులకు రక్షణగా ఉన్న 29 కార్మిక చట్టాలు రద్దు చేసిన నాలుగు లేబర్ కోడ్స్ అమల్లోకి తెచ్చిందని మరొకవైపు రైతాంగం, వ్యవసాయ కార్మికులను ఫణంగా పెడుతూ విద్యుత్ సవరణ చట్టం, 2025 విత్తన చట్టం, విబిజి రాంజీ చట్టం తీసుకొచ్చారు. వీటి వలన కార్మికులు రైతులు,కూలీల తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఫిబ్రవరి 12 దేశవ్యాప్తంగా సమ్మె జయప్రదం చేయాలని కోరినారు ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు డి రమాదేవి, ఏ నాగమణి, బి విజయ, సుజాత, నర్మదా, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

# గోవా బీచ్ స్థాయిలో సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నాం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్










(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 3)

గోవా బీచ్ స్థాయిలో సూర్యలంక బీచ్ ను అభివృద్ధి చేస్తున్నామని, వచ్చే ఐదేళ్లలో అతిపెద్ద పర్యాటక ప్రాంతంగా బాపట్ల మారిపోతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. సూర్యలంక బీచ్, పాండురంగాపురం బీచ్ లను సింగపూర్ ప్రభుత్వ అధికారుల బృందం, జిల్లా కలెక్టర్ కలిసి మంగళవారం పర్యటించారు. సూర్యలంక బీచ్ లో జరుగుతున్న స్వదేశీ దర్శన్ పర్యాటక అభివృద్ధి ప్రాంతాలను పరిశీలించారు. సూర్యలంక బీచ్ గుంతలు లేకుండా సజావుగా సురక్షితమైన ప్రాంతమని చెప్పారు. సున్నితమైన సన్న ఇసుక, పరిశుభ్రంగా ఉండే బీచ్ సూర్యలంక కావడం దీని ప్రత్యేకత అని వివరించారు. రైలు, బస్సులు సౌకర్యం జిల్లా కేంద్రానికి ఉండగా, అక్కడి నుంచి కేవలం ఎనిమిది కిలోమీటర్ల దూరంలో సూర్యలంక బీచ్ ఉండడం పర్యాటకులకు అనువైన ప్రాంతంగా చెప్పారు. భారత వైమానిక దళం సూర్యలంక బీచ్ కు సమీపంలో ఉండడం సురక్షిత ప్రాంతం అన్నారు. ఇక్కడ ఒంటెలు, గుర్రాలపై స్వారీ చేయడం సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తాయన్నారు. ప్రతిరోజు సాధారణంగా సూర్యలంక బీచ్ కు మూడు నుంచి నాలుగు వేలమంది పర్యాటకులు వస్తుంటారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వదేశీ దర్శన్ కింద సూర్యలంక బీచ్ ను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. ఎంతోకాలంగా ఎండు చేపలు, ఎండు రొయ్యల విక్రయాలు, సముద్ర జలాల నుంచి లభించే తాజా ఆహార పదార్థాలు ఇక్కడ లభిస్తాయన్నారు. పర్యాటకులను కనువిందు చేసే అనువైన ప్రాంతం ఈ బీచ్ కావడంతోనే సెప్టెంబర్ లోగా అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని వర్ణించారు. పార్కు, అంతర్గత రహదారుల నిర్మాణం, దుకాణాలు, పర్యాటకులను అలరించే వివిధ నిర్మాణాల గురించి ఆయన తెలిపారు. బయో ఫ్లాగ్ టెక్నాలజీతో చేపట్టిన రొయ్యల సాగు యూనిట్ ను కలెక్టర్, సింగపూర్ అధికారుల బృందం పరిశీలించింది. అడవి పంచాయతీలో సురేష్ అనే ఆక్వా రైతు 5 ఎకరాలలో ప్రారంభించిన రొయ్యల సాగు పరిశ్రమను బృందం పరిశీలించింది. పర్యావరణానికి ఎలాంటి హాని లేని బయో ఫ్లాగ్ టెక్నాలజీతో నూట ఇరవై మిలియన్ రొయ్య పిల్లల ఉత్పత్తి ఒకేసారి చేపట్టడం అభినందనీయమని దక్షిణాసియా మిడ్డిల్ ఈస్ట్ అండ్ ఆఫ్రికా, సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చాంగ్ తెలిపారు. సదరు రైతు సురేష్ తో సింగపూర్ అధికారులు మాట్లాడారు. ఈ సాగు వల్ల లాభనష్టాలను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, అధిక దిగుబడులు వచ్చే నూతన విధానంలో ప్రభుత్వం సహాయంపై ఆరా తీశారు. ఇక్కడ ఉత్పత్తి చేసే రొయ్య పిల్లలను వివిధ ప్రాంతాలకు విక్రయించడం, తదుపరి రొయ్య సాగుతో ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏడాదికి ఐదుసార్లు పంట చేతికి వస్తుందని, ప్రభుత్వం సహాయంతోనే ఈ సాగు చేస్తున్నానని రైతు వివరించారు. స్థానిక ప్రజలు రొయ్యల వినియోగం తక్కువగానే ఉంటుందని కలెక్టర్ కు విన్నవించారు. పర్యటనలో సింగపూర్ ఎకానమిక్ కన్సల్టెంట్ ఫ్రైస్ సీఈవో చూతోక హిమ్, సింగపూర్ కోపరేషన్ ఎంటర్ ప్రైజ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ త్యాలైన్ చీవో, సింగపూర్ సస్టైనబిలిటీ స్టాటజిక్ ప్రాజెక్ట్ సీనియర్ మేనేజర్ నిషశర్ధ, రాష్ట్ర ఆర్థిక ఘనంగా శాఖ డైరెక్టర్ బి గోపాల్, ఆర్‌డిఓ పి గ్లోరియా, మత్స్యశాఖ జెడి శ్రీనివాస్ నాయక్, డిడి గాలి దేముడు, తదితరులు ఉన్నారు.

# కళ్యాణం కమణీయం....
# శ్రీ వేణుగోపాలుని కళ్యాణం





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఫిబ్రవరి 3)

మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో, వేణుగోపాలస్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో కనిగిరి డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్ పాల్గొని స్వామి వారి కళ్యాణం తిలకించారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయ భాస్కరరావు పర్యవేక్షణలో మంగళవారం ఉదయం స్వామి వారి కళ్యాణం మాఘ మాస మఖా నక్షత్రమిగులు కాలమందు ఆలయ ప్రధాన అర్చకులు కారంపూడి రమణాచార్యులు, స్థానాచార్యులు రామగోపాలాచార్యులు ఆగమాచార్యులు లక్ష్మణ తిలక్, పరిచారకులు సాయిమోహన్, వేదపండితుల మంత్రోచ్ఛరణతో పండంటి వెన్నెలలో దేవతలు నిర్మించిన కళ్యాణ మండపంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలుని కళ్యాణ మహోత్సవం మామిడి ఆకుల తోరణాలతో, అరటి పిలకల స్వాగతాలతో, బాజా భజంత్రిల నడుమ భక్తులకు కనువిందు చేసే విధంగా పండితులు నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని ప్రత్యేక అలంకరణతో కూనపులి రమణయ్య తీర్చిదిద్దారు. కళ్యాణ మహోత్సవానికి ఉభయ దాతలుగా జవ్వాజి విజయ భాస్కరరావు దంపతులు వారి కుమారుడు జవ్వాజి సాయి కృష్ణ దంపతులు వ్యవహరించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవ సమయంలో దేవదేవేరులకు పట్టు వస్త్రాలు తర్లుపాడు జడ్పిటీసి వెన్నా ఇందిరాహనుమారెడ్డి, ఇండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, విఆర్‌ఓ కంచర్ల శివాకాసి దంపతులు అందజేశారు. కళ్యాణ మహోత్సవంలో ముత్యాల తలంబ్రాలు స్వర్గీయ గోపు వెంకటయ్య ధర్మపత్ని శ్రీదేవి, సిద్ధం శివకుమార్ దంపతులు అందజేశారు. స్వామి వారికి 60 వేల విలువ చేసే శఠగోపం కొలగట్ల నారాయణరెడ్డి ధర్మపత్ని చిన్నక్క కుమారుడు పోలిరెడ్డి ఆలయ ధర్మకర్తకు అందజేశారు. వ్యాఖ్యాత దుర్గా వెంకటశ్వరరావు కళ్యాణ మహోత్సవం విశిష్టత గురించి వ్యాఖ్యానిస్తూ పుడమిని పాలించే పురుషోత్తముడు సూర్య తేజముతో సతీ సమేతుడై దర్శనం ఇస్తున్నాడని, కళ్యాణం అనేది పూర్వత్వానికి సంకేతం. సమస్థమైన శుభాలను ఇచ్చేది స్వామి వారి కళ్యాణం అని అన్నారు. కనిగిరి డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యస్వంత్ కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి దేవేరుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి వారు ఉత్సవమూర్తులతో హంస వాహనం పై తర్లుపాడు మాడ విధుల్లో విహారిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. హంస వాహన ఉభయ దాతలు సిద్ధం శివకుమార్ ధర్మపత్ని నిర్మల, స్వర్గీయ గోపు వెంకటయ్య ధర్మపత్ని శ్రీదేవి వారు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ బ్రహ్మనాయుడు, జడ్పిటీసి వెన్నా ఇందిరా, ఎంపీపీ సూరెడ్డి సుబ్బారెడ్డి, వాసవి సముదాయ సత్రం సభ్యులు పోలేపల్లి జనార్ధన్, సూరెడ్డి సుబ్బారెడ్డి, ఈర్ల వెంకటయ్య, కాళంగి శ్రీనివాసులు, గోసు వెంకటేశ్వర్లు, గోసు ఆదినారాయణ, కుందురు చిన్నకాశిరెడ్డి, కొలగట్ల భాస్కర్‌రెడ్డి, జవ్వాజి వెంకటేశ్వర్లు, దోగిపర్తి మల్లిఖార్జున, జవ్వాజి జనార్దన్, చినమనగొండ సుబ్రహ్మణ్యం, తిప్పిరెడ్డి వెలుగొండారెడ్డి, కొలగట్ల గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com